థాంక్యూ, డాక్టర్ బలరామ కృష్ణమూర్తి

ప్రాక్టీస్ కొత్తగా పెట్టాను. పెట్టుబడి ఎక్కువగా పెట్టలేకపోవడం వల్ల సింపుల్‌గా చిన్న క్లినిక్‌లా పెట్టాను.

డాక్టర్ కోర్సు ఎంతో కష్టపడి చదివి అది ప్రజా జీవితానికీ, నా జీవితానికీ ఎంతవరకు ఉపయోగపడుతుందో తెలుసుకోబోతున్న రోజు లవి.

మొదటి రోజు పెషెంట్లు కాదు కదా, ఈగలు కూడా రాలేదు తోలుకోవడానికి. కొద్దిగా నిరాశపడ్డా నిరుత్సాహ పడలేదు. రెండవ రోజు ఎదురు చూడగా, చూడగా ఓ పేషెంటు వచ్చింది చిన్న పిల్ల నెత్తుకుని.

తల్లి చినిగిన రవిక, మాసిన బట్టలతో ఉంది. పిల్ల సరేసరి చాలా అపరిశుభ్రంగా ఉంది. నాకూ ఒక పేషెంట్ వచ్చిం దన్న సంతోషం ఒక వైపు ఉన్నా 'ఇ దేదో ఫ్రీ కేను బావతులా ఉం' దన్న అనుమానం పీడుస్తోంది మనసులో.

ఆలోచిస్తూనే పరీక్షలు చేసి మందులు రాసి చీటీ ఇచ్చాను. ఆమె దా న్నందుకొని చినిగిన జాకెట్లోకి చేతులు పోనిచ్చింది. నేను ఏదో మేగజైన్ తిరగేస్తున్నాను.

"డాక్టర్ బాబూ!" అన్న పిలుపు విని మేగజైన్‌లో నుంచి తలెత్తాను.

నలిగి ఉన్న పది రూపాయల నోటుతో చేయి నా వైపు చాపింది. ముందు ఎలా అనుకున్నా అప్పుడు ఆమెను చూసి ఆమె దగ్గర డబ్బులు తీసుకోవాలంటే నా మనసు సందేహించింది. అలాగే తీసుకున్నాను సిగ్గుపడుతున్నట్టుగా. ఆమె వెళ్ళిపోయింది.

కొంతసేపు చూసి ఎవరూ రాకపోయేసరికి క్లినిక్ మూసి ఇంటికి వెళ్ళిపోయాను. 'కొత్త బిచ్చగాడు బుద్ధెరగడు' అన్నట్టు మళ్ళీ రెండు గంటలకే స్నానం చేసి వెంటనే క్లినిక్‌కు వచ్చేశాను.

ఓ అరగంట చూడగా చూడగా ఓ అరడుగుల అచ్చ తెనుగు ఆంధ్రుడు, పంచె కట్టుకున్న ఓ పెద్ద మనిషి చేతిలో సిగరెట్‌తో పక్కన నీరసంగా ఓ ముసలావిడతో వచ్చాడు.

"మై నేమ్ ఈజ్ గవ ర్రాజు. అ యామ్ వర్కింగ్ యాజ్ పి.ఏ. టు హోమ్ మినిస్టర్ ..." అని మొదలుపెట్టి ఆయన ఎంతమంది మినిస్టర్‌లకు పి.ఏ.గా చేసిందీ, తనకు ఎంత పలుకుబడి ఉన్నదీ, ఎంతమందికి ఎన్ని పనులు చేసిపెట్టిందీ ఓ గంటన్నర అనర్గళంగా చెప్పేశాడు. ఈ లోపల నాలుగు సిగరెట్లు పీల్చిపారేసి దాని పొగ మా క్లినిక్ నిండా నింపేసి, మధ్య మధ్య 'యాష్ ట్రే పెట్టలేదేమిటీ?' అన్నట్టు నా వైపు చూసి ఆ పీకలు బయట పారేసి వచ్చేవాడు.

తరువాత సంక్షిప్తంగా పక్కనున్న పేషెంటు తనకు బంధువనీ, అనారోగ్యంతో బాధపడుతోందనీ, చూసి మందులు రాయమనీ చెప్పాడు.

పొగంటే పడని నాకు లోపల చాలా కోపంగా ఉంది. అయినా 'కొత్తగా ప్రాక్టీసు పెట్టాను ... జాగ్రత్తగా ఉండాలి' అని నన్ను నేనే చెప్పుకున్నాను.

పరీక్ష చేసి మందులు రాసిచ్చాను.

"డాక్టర్! ఇఫ్ యు టేంట్ మైండ్! అర్ దేర్ ఎనీ శాంపుల్స్ ఆఫ్ దీజ్ మెడిసిన్స్?" అన్నాడు.

"డబ్బు లిస్తాడు కదా!" అని మనసులో అనుకుని నా దగ్గరున్న శాంపుల్స్ తీసి ఇచ్చాను.

అవి అందుకుని - "మీకు ఎపుడైనా ఏదైనా అవసరమైతే నన్ను కలవండి. గవర్నమెంటు పోస్టు వేయించాలన్నా వేయించగలను. మీరు నర్సింగ్ హోమ్ పెడితే సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఫ్రీగా ఇప్పిస్తాను ..." అంటూ నిలబడే మరో అరగంట అనర్గళంగా మాట్లాడేశాడు.

"ఏనీ హౌ థాంక్యూ!" అని చెయ్యిచ్చి వెళ్ళిపోయాడు ఫీజు ఇవ్వకుండానే. అతని జేబులో ఉన్న నోట్ల కట్ట అతను వెళ్ళేపుడు నన్ను వెక్కిరించిన ట్టనిపించింది. ★